

బస్సుల్లోనే మహిళలకు రక్షణ

ఆర్టీసీ బస్సుల్లోనే మహిళా ప్రయాణికులకు రక్షణ ఉంటుందని ఆర్ఎం శ్రీదేవి పేర్కొన్నారు.

- 10లో



గేట్ల బిగింపు ఆలస్యం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద కుడి కాల్వకు గేట్ల బిగింపు పనులు ఎండల కారణంగా ఆలస్యమవుతున్నాయి.

- 10లో

గరిష్టం/కనిష్టం

43° / 29°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఫైన్ ఆర్ట్స్ స్కూల్స్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు మే 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరి పాఠశాలల్లో ఫైన్ ఆర్ట్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు tswreis.ac.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు మే 29న హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, జూన్ 4వ తేదీ ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

సంపన్నులకు దోచిపెడుతున్న మోదీ



సీపీఐ ప్రజాగర్జన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపదను సంపన్న వర్గాలకు దోచిపెడుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు బీజేపీ హటావో.. దేశ్‌కి బచావో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు తీర్పరి వెంకటేశ్వర్లు, పబ్బు వీరస్వామి, బంటు వెంకటేశ్వర్లు, ఆర్.అంజయ్యాచారి, గిరి, రమ తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టేందుకే బీసీ డిక్లరేషన్



తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ జిల్లా సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మభ్యపెట్టేందుకు బీసీ డిక్లరేషన్ పేరుతో ముందుకొస్తున్నాయని సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ బంగు ప్రసాద్‌గౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండలోని యాదవ్ సంఘం భవన్‌లో నిర్వహించిన తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీల మనుగడకు రాజ్యాధికారమే దిక్కు అని, ఆ దిశగా బీసీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఏం చేశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, కె.వి.గౌడ్, గౌతమ్, శంకర్, వలిగి ప్రభాకర్, గిరి, అంజయ్య, రుద్రాక్ష భాస్కర్, నరేష్, శ్రీనివాస్, యాదయ్య, నీలకంఠ నాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ప్రీ బిడ్ సమావేశం

నల్లగొండ : నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డి గూడెం సమీపంలోని రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్ షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు జూన్ 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఐదో విడత బహిరంగ వేలంపై అవగాహన కల్పించేందుకు గురువారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం నియమ నిబంధనలు, ప్రక్రియపై అవగాహన కలిగించేందుకు కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ఔత్సాహికులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

● విజేతలకు బహుమతులు



క్రీడాపోటీల్లో విజేతలకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటవచ్చని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు వారికి నచ్చిన క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బుల్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పీఈటీలు పాల్గొన్నారు.

పరిహారం ఎప్పుడిస్తరు?

- మార్చి, ఏప్రిల్‌లో అకాల వర్షాలకు భారీగా పంట నష్టం
- 3,321 ఎకరాల్లో పంట నష్టపోయిన 2,667 మంది రైతులు
- ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామన్న ప్రభుత్వం
- రెండు నెలలైనా విడుదలకాని నిధులు
- రైతులకు తప్పని ఎదురుచూపులు



కనగల్ : కురంపల్లి వద్ద నేలవాలిన వరి చేను (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పంట నష్ట పరిహారం ఎప్పుడొస్తుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. రెండు నెలలు కావస్తున్నా పరిహారానికి ఇంతవరకు అతీగతీ లేకపోవడంతో రైతుల్లో నిరాశ అలుముకుంటోంది. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలైన అకాల వడగండ్ల వర్షాలు, భారీ వర్షాలు ఈదురుగాలులకు ప్రతీ సీజన్‌లో రైతులు వేసిన పంటలకు నష్టం వాటిల్లుతున్నప్పటికీ వ్యవసాయశాఖ అధికారులు సర్వేలు చేయడం, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారే తప్ప నష్ట పరిహారం అందడం లేదు. పరిహారం ఇస్తామని ఈసారి సీఎం ప్రకటించిన నేపథ్యంలో పరిహారం వస్తుందని ఆశించినా జాప్యం అవుతుండడంతో **రైతుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.**

రూ.కోట్లలో నష్టపోయిన రైతులు

మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలతో జిల్లాలో భారీగా పంట నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న నేలవాలగా, మామిడి, బత్తాయి, నిమ్మకాయలు నేలరాలాయి. వాటికితోడు వాటర్ మిలాన్ తదితర పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో మొత్తంగా 3,321.13 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, అందులో వరి వంటి ఆహార పంటలు 3,071.7 ఎకరాల్లో, 249.43 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో 2,667 మంది రైతులకు రూ.కోట్ల పంట నష్టం వాటిల్లింది.

పరిహారం వస్తే అప్పులు చెల్లించాలని..

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎకరానికి రూ.10 వేలు పంట నష్టం కింద అందిస్తామని సీఎం ప్రకటించడంతో రైతులకు కొంత ఊరట కలిగింది. వారం రోజుల్లోనే పరిహారం అందుతుందని అంతా భావించారు. ఆ పరిహారంతో పంటలు సాగు చేసేందుకు చేసిన అప్పుల్లో కొంతైనా చెల్లించవచ్చని భావించారు. ఇప్పటివరకు రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పరిహారం గురించి ఏఈఓల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు ఎవరిని అడిగినా మౌనమే సమాధానమవుతోంది. తాము మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన పంట నష్టంపై అంచనా వేసి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెబుతున్నారు. పరిహారం ఎప్పుడు వస్తుందనే విషయాన్ని మాత్రం ప్రభుత్వమే చెప్పాలని పేర్కొంటున్నారు.

నష్టపోయిన పంటల వివరాలు.. (ఎకరాల్లో)

మండలం	ఆహార పంటలు	ఉద్యాన పంటలు	రైతులు
గుర్రంపోడు	1,092.26	52.22	757
చిట్యాల	78.15	30.2	74
నాంపల్లి	7	66.2	53
మర్రిగూడ	15.06	18.39	48
నార్కట్‌పల్లి	72.08	9	79
కనగల్	59.63	36.12	42
చింతపల్లి	1.2	0	1
నల్లగొండ	0	15	15
పెద్దవూర	0	1	1
డిండి	842.38	0	735
చండూరు	209.15	10	197
దేవరకొండ	360.18		7.11179
శాలిగౌరారం	182.36	0	324
మునుగోడు	3.20	0	4
కట్టంగూరు	0	4.19	4
చందంపేట	149.05	0	154
మొత్తం	3,071.7	249.43	2,667

పరిహారం అందితే అప్పు తీర్చుతా



నాకున్న మూడెకరాల్లో వరి సాగు చేశా. పంట కోతదశలో ఉండగా వడగండ్లతో కురిసిన అకాల వర్షానికి సాగు చేసిన పొలంలో దాదాపు ఎకరన్నర విస్తీర్ణంలో వడ్లు నేల రాలిపోయాయి. వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటను గుర్తించినా నాకు ఎలాంటి పరిహారం అందలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందిస్తే పెట్టుబడికి తెచ్చిన రూ.90 వేలలో కొంతమేర అప్పు తీర్చుతా.

– వడ్లకొండ పెద్దయ్య రైతు, టి.గౌరారం, డిండి మండలం

పెట్టుబడి నష్టపోయా



నాకున్న 2.27 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.లక్ష పెట్టుబడి పెట్టా. రూ.3 లక్షల ఆదాయం వస్తుందని ఆశించా. కంకి దశలో అకాల వర్షం, రాళ్లవాన పడటంతో పంట మొత్తం నేలకొరిగింది. కేవలం 50 క్వింటాళ్ల దిగుబడితో రూ.70 వేలే చేతికందాయి. రూ.30 వేలు పెట్టుబడి నష్టపోయా. ఎకరం వరి చేను సాగు చేస్తే రాళ్లవానకు వడ్లురాలి నష్టపోయా.

– చాద యాదయ్య, కట్టవారిగూడెం, గుర్రంపోడు మండలం

అప్పులు మిగిలాయి



నాకు అరెకరం ఉండగా.. మరో అరెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశా. పెట్టుబడి కోసం రూ.1.80 లక్షలు అప్పులు చేశా. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వానతో పంట మొత్తం నేల వాలడంతో 75 శాతం వడ్లు నేల రాలాయి. వచ్చిన పంట దిగుబడులు కౌలుకే సరిపోయాయి. మిగితా అప్పులు అలాగే ఉన్నాయి. పంటనష్ట పరిహారం వస్తే కొంతవరకైనా అప్పుల బాధ నుంచి బయట పడుతా.

– భీమగాని శ్రీను, చిత్తలూరు, శాలిగౌరారం మండలం

పెండింగ్ కేసులను పరిష్కరించాలి : ఎస్పీ

నల్లగొండ క్రైం : పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో గత నెలలో జరిగిన నేరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల పురోగతి, విచారణలో అధికారులంతా చురుకుగా పని చేయాలని ఆదేశించారు. శిక్షల శాతం మరింత పెరిగే విధంగా చర్యలు తీసువాలన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి పూట గస్తీ, పెట్రోలింగ్ పెంచాలని, 100 కాల్‌కి వెంటనే స్పందించాలని తక్షణ సహాయం అందించాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ కెఆర్‌కె.ప్రసాదరావు, డీఎస్పీలు నరసింహారెడ్డి, వెంకటగిరి, నాగేశ్వర్‌రావు, రమేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాల్వ భూములు కబ్జా!

- ఆక్రమణలో ఏఎమ్మార్పీ కాల్వ దారులు
- తమ భూముల్లో కలుపుకుంటున్న కాల్వ వెంట ఉన్న రైతులు
- గుర్రంపోడు డివిజన్‌లోనే 300 ఎకరాల భూమి అన్యాక్రాంతం
- హద్దుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు



కోయగూరోనిబావిలో డి-25 భూమి ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



నడికూడలో డి -22 కాల్వ అంచు వరకు దారి లేకుండా దున్నిన భూమి

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ కాల్వల వెంట గల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రస్తుతం వానాకాలం పంటల సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్న రైతులు కాల్వల వెంట దారి లేకుండా తమ భూముల్లో కలిపి దున్నుకుంటున్నారు. మట్టి కట్టలను సైతం తొలగించి ఆక్రమించుకుంటున్నారు. భూసేకరణ సమయంలో కాల్వల కోసం తీసుకున్న భూములను రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించకపోవడంతో అక్రమణలకు అవకాశంగా మారింది. ఆక్రమణలపై ఫిర్యాదులు అందినా భూముల రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులపై రాజకీయ ఒత్తిడి వస్తుండడంతో వారు చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

2200 ఎకరాల్లో కాల్వ భూములు

గుర్రంపోడు మండల పరిధిలో ఏఎమ్మార్పీ డి–17 నుంచి డి–26 వరకు 35 కిలోమీటర్ల ప్రధాన కాల్వ, 250 కిలోమీటర్ల మేజర్, మైనర్ కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వ వెంట ఇరువైపులా వంద ఫీట్లు, మేజర్, మైనర్ కాల్వల వెంట ఎడమవైపు 27 ఫీట్లు, కుడివైపు 15 ఫీట్లు స్థలాన్ని రహదారుల కోసం సేకరించారు. ఇన్‌స్పెక్షన్ పాత్‌లుగా కాల్వల వెంట అధికారుల పర్యవేక్షణకు వీటిని వినియోగించేందుకు వాటిని నిర్ధేశించారు. కాల్వలు తవ్వే సమయంలో డీప్ కటింగ్ జరపాల్సిన చోట్ల మట్టిపోసేందుకు ఎక్కువ విస్తీర్ణంలో అక్కడక్కడా భూసేకరణ జరిగింది. అయితే, ఏఎమ్మార్పీ గుర్రంపోడు డివిజన్ పరిధిలో 2,200 ఎకరాల్లో కాల్వ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నా కాల్వలు పోగా సుమారు 300 ఎకరాలు కబ్జాలోనే ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

రైతుల మధ్య వివాదాలు..

మేజర్, మైనర్ కాల్వల వెంట దారి ఆక్రమణల ఫలితంగా కాల్వల వెంట ప్రారంభంలో గల రైతులకు చివరన గల రైతులకు మధ్య దారి విషయమై వివాదాలు జరుగుతున్నాయి. కాల్వలతో దారులు ఏర్పడ్డాయని సంతోషంతో ఉన్న రైతులకు మొదట్లో ఉన్న వారు ఆక్రమణలకు పాల్పడుతుండటంతో కనీసం నడిచిపోయేందుకు కూడా దారి లేకపోవడంతో రైతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చాలాచోట్ల కాల్వ దారులు ఒకవైపు మాత్రమే మిగిలి మరోవైపు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి.

కనిపించని హరితహారం జాడ..

గుర్రంపోడు మండల కేంద్రంలోని ఏఎమ్మార్పీ డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల ప్రధాన కాల్వ వెంట వద్దిరెడ్డి గూడెం పరిధిలో ఆక్రమణలో ఉన్న భూమిలో పల్లెపకృతి వనం ఏర్పాటుకు ఏఎమ్మార్పీ అధికారులు ఎంపీడీఓకు అప్పగించారు. అయినా అక్రమణదారులకు భయపడి అధికారులు పల్లె పకృతి వనం ఏర్పాటుకు సాహసించడం లేదు. కాల్వల వెంట రెండేళ్ల క్రితం హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. కాల్వల వివరాలను ఏఎమ్మార్పీ అధికారులు ఎంపీడీఓ కార్యాలయానికి అందించినా.. ఆక్రమణలను తొలగించే విషయంలో రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో ఎక్కడా ఒక్క మొక్కను కూడా నాటలేదు.

అధికారులకు తలనొప్పిగా కేసులు..

రికార్డుల ప్రకారం కాల్వ భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని భూసేకరణ విభాగానికి ఏఎమ్మార్పీ అధికారులు విన్నవించినా ఇప్పటికీ ఎటూ తేలలేదు. ఆక్రమణలు వివాదమైన చోట ఏఎమ్మార్పీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భంగా రాజకీయ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు రావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు వాపసు తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అధికారులు అంటున్నారు. తమకు జ్యుడిషియల్ అధికారాలు ఇవ్వాలని అప్పుడే ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి పూర్తి అధికారం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఆక్రమణలపై చర్యలు ఏవీ



ఏఎమ్మార్పీ కాల్వదారులు ఆక్రమణకు గురవుతుండడంతో రైతుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. నడికూడ గ్రామంలో డి– 22 కాల్వకు ఇరువైపులా రైతులు కాల్వ అంచు వరకు ఆక్రమించారు. దీంతో ఇతర రైతులు నడిచి వెళ్లేందుకు కూడా వీలు ఉండడం లేదు. కాల్వదారులు నిర్ధేశించిన మేరకు ఉండేలా హద్దులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– వద్దగోని గంగాధర్, రైతు, నడికూడ

భూములను స్వాధీనం చేసుకుంటాం



ఏఎమ్మార్పీ కాల్వల వెంట గల భూములపై రైతులకు ఎలాంటి హక్కులు ఉండవు. అప్పట్లో తాము తక్కువ ధరకే ఇచ్చామని, తమ భూముల వెంట మిగిలిన ప్రభుత్వ భూమి తమకే దక్కుతుందనే మొండి వాదనలతో దర్జాగా ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని గుర్తిస్తున్నాం. తాత్కాలికంగా ఆక్రమణలోకి తీసుకున్నా తమది కాని భూమి విషయంలో రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. రికార్డుల్లో తొలగించలేదని కాల్వల భూములను రిజిస్టర్ చేయించుకున్నా పట్టా రద్దు చేయించి స్వాధీనం చేసుకుంటాం.

– ఆనందరావు, ఏఎమ్మార్పీ, డివిజన్ ఈఈ

చర్లపల్లివాసికి సివిల్స్‌లో 510వ ర్యాంకు



భువన ప్రణీత్



కుటుంబ సభ్యులతో భువన ప్రణీత్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లికి చెందిన పప్పుల భువన ప్రణీత్ సివిల్స్‌లో 510వ ర్యాంకు సాధించాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో బీ.టెక్, ఎం.టెక్ పూర్తి చేసిన ప్రణీత్ కొద్ది రోజులపాటు బిజినెస్, ప్రైవేట్ ఉద్యోగం చేశాడు. తర్వాత 2020 నుంచి సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. ఆన్‌లైన్ ద్వారా సివిల్స్ శిక్షణ పొందిన ప్రణీత్ 510వ ర్యాంకు సాధించడంతో అతని కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రణీత్ తండ్రి పప్పుల క్రిష్ణయ్య గతంలో నల్లగొండ విద్యుత్ కార్యాలయంలో ఎస్ఈగా పనిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్ విద్యుత్ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి లక్ష్మీప్రసన్న పంచాయత్ రాజ్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రణీత్ కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది.

తాతయ్య కోరిక నెరవేరింది

సివిల్స్ సాధించాలనే తన తాతయ్య రాములు కోరిక నెరవేరిందని ప్రణీత్ పేర్కొంటున్నాడు. తాతయ్య సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగిగా రిటైర్డ్ అయ్యారని.. అమ్మానాన్న ఉద్యోగస్తులు కావడంతో.. సివిల్స్ సాధించాలనే నాలో బలంగా కలిగిందని చెప్పారు. ఎం.టెక్ పూర్తయ్యాక బిజినెస్, ప్రైవేట్ కన్సల్టెంట్‌లో పని చేసినా.. ఆ తర్వాత 2020 నుంచి సివిల్స్‌కు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తీసుకుని మూడవ ప్రయత్నంలో ఆలిండియా 510వ ర్యాంకు సాధించానని పేర్కొన్నాడు. తన విజయంలో అన్నయ్య లిఖిత్ సహకారం మరువలేనిదని.. వృత్తి నిర్వహణలో అందరికీ సమన్యాయం అందేలా కృషి చేస్తానని చెప్పారు.

మెడికల్ కళాశాలల్లో నియామకాలకు ఓకే

- నల్లగొండలో 42, సూర్యాపేటలో 46 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ఉత్తర్వులు
- సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కళాశాలలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నల్లగొండ మెడికల్ కళాశాలలో 42, సూర్యాపేట మెడికల్ కళాశాలలో 46 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయనుంది. నియామకాలకు సంబంధించి బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఒక సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు ఈ నియామకాలు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరించేందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ కచ్చితంగా దోహద పడుతుందని తెలిపారు.

పోస్టులు ఇలా..

నల్లగొండలోని మెడికల్ కళాశాలలో 42 పోస్టులకుగాను జనరల్ మెడిసిన్ (5), జనరల్ సర్జన్ (6), ఆర్థోపెడిక్ (2), పీడియాట్రిక్ (4), ఓబీజీ (8), అనస్థీషియా (7), అనాటమి (1), పాతాలజీ (1), మైక్రో బయాలజీ (1), ఫోరెన్సిక్ మెడిసిన్ (1) రేడియో డయాగ్నిస్ (2), బయోకెమిస్ట్రీ (1), కమ్యూనిటీ మెడిసిన్ (1), ట్రాన్స్‌ఫ్యూజన్ మెడ్ (1), ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ (1) అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టనుంది.

సూర్యాపేట మెడికల్ కళాశాలలో..

సూర్యాపేట మెడికల్ కళాశాలలో 46 పోస్టులు మంజూరు చేయగా వాటిలో జనరల్ మెడిసిన్ (5), జనరల్ సర్జన్(7), ఆర్థోపెడిక్ (3), పీడీయాట్రిక్ (5), ఈఎన్‌టీ (1), ఓబీజీ (8), అనస్థీషియ (7), అనాటమి (1), పాతాలజి (2), మైక్రోబయోలజీ (1), ఫోరెన్సిక్ మెడిసిన్ (1), రేడియో డయాగ్నస్ (3), ఆప్తాలజీ (1), కమ్యూనిటీ మెడిసిన్ (1) చొప్పున అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించనుంది.

ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నాం

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, పౌర సరఫరాల కమిషనర్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ధాన్యం కొనుగోలు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపించిన ధాన్యం మిల్లింగ్ చేసిన బాయిల్డ్ రైస్ ఎఫ్‌సీఐ తీసుకోవడం లేదని తెలియజేశారు. జిల్లాలో రూ.130 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని వివరించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా అలాట్ చేసిన రైస్ మిల్లులు తప్పనిసరిగా దిగుమతి చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద అందుబాటులో ఉన్న స్థలంలో దాన్యం దిగుబడి చేస్తున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పౌసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం బోల్తా.. ముగ్గురికి గాయాలు


రోడ్డు పక్కన బోల్తాకొట్టిన తుపాన్ వాహనం

మోటకొండూర్ : ప్రయాణికులతో వెళ్తున్న తుపాను వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామం బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పదకొండు మంది ప్రయాణికులతో తుపాను వాహనం హైదరాబాద్ నుంచి తొర్రూరుకు బయలుదేరింది. మార్గమధ్యలో మండలంలోని ముత్తిరెడ్డిగూడెం వద్దకు రాగానే అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన సైకిల్‌ను తప్పించబోయి తుపాను వాహనం బోల్తాకొట్టింది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి గ్రామంలో ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గడ్డివాము, పైపులు దగ్ధం


దగ్ధమైన గడ్డివాము, వైర్లు

మోత్కూరు : గుర్తుతెలియని వ్యక్తులు వేసిన నిప్పుతో మంటలు అంటుకొని గడ్డివాములు, పైపులు, కేబుల్ వైర్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌళ్లరామారం ప్రాంతంలో సుక్క సైదులుకు చెందిన వ్యవసాయ బావి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు వేసిన నిప్పుతో మంటలు అంటుకొని రెండు గడ్డివాములు, కేబుల్ వైర్లు, ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.40 వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅడిశర్లపల్లి మండలం ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి అంజనేయులు(30) చిల్కమర్రి సమీపంలోని గార్డెన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 21న విధులు ముగించుకొని తిరుగుపయనంలో ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో మండలంలోని అంగడిపేట స్టేజీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో కడుపులో బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ, అక్కడి హైదరాబాదులోని ఓవైసీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

అన్నదాతకు నకిలీల బెడద

- నాసిరకం విత్తనాలు, ఎరువులతో మోసపోతున్న రైతులు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వ్యవసాయ అధికారులు



పెద్దవూర, పెన్‌పహాడ్ : రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే మార్కెట్లో నకిలీల బెడద ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా లేకుంటే మోసపోయే ప్రమాదం ఉంటుంది. అధిక లాభాల కోసం వ్యాపారులు నాసిరకం ఎరువులు, సీడ్స్ అంటగట్టే అవకాశాలు లేకపోలేదని, రైతులు వాటిపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనేముందు..

వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. విక్రయదారు ఇచ్చే కరపత్రాలు తీసుకొని వాటిలో పేర్కొన్న అంశాలు చదవాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, కంపెనీ పేరు ఉన్నాయో లేవో సరి చూసుకోవాలి. అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. విడిగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచి డబ్బాల విత్తనాలు కొనవద్దు. కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్ సీసీ, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు దాచిపెట్టుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉంటేనే విత్తనాలను వాడుకోవాలి.

ఎరువులు తీసుకునేటప్పుడు..

డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న సంచులనే ఎంచుకోవాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు ఉంటనే కొనాలి. చిల్లులు పడి, చిరిగిన బస్తాలను తీసుకోవద్దు. అన్య పదార్థాలు కలిస్తే కల్తీగా గుర్తించాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారి సహాయంతో పరీక్షకు పంపాలి.

పురుగు మందులు..

వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకు పురుగు మందులు కొనాలి. క్రిమి సంహారక డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి. పురుగు మందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి. పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించవద్దు.

సూచనలు పాటించాలి



వానాకాలం పంటల సాగుకు వినియోగించే విత్తనాలు, ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలి.

– కృష్ణసందీప్ వ్యవసాయ అధికారి

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని పాతగుట్టలో జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సఖి సెంటర్ అధికారులు అడ్డుకున్నారు. బాలల పరిరక్షణ విభాగం అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన 16సంవత్సరాల బాలికను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన ఓ అబ్బాయితో పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరుగుతుందని బుధవారం ఉదయం 8గంటలకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో బాలల పరిరక్షణ అధికారులు స్థానిక యాదగిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోగా.. ఆ తర్వాత జిల్లా బాలల పరిరక్షణ విభాగం, సఖి సెంటర్ అధికారులు చేరుకొని బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఇరు కుటుంబాల పెద్దలను బాల్య వివాహాలతో కలిగే సమస్యలు, అనర్థాల గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పెళ్లీడు వచ్చాకే వివాహం చేయాలని వారికి సూచించారు. అనంతరం వీరిని జిల్లా బాలల సంక్షేమ సమితి ముందు హాజరుపరిచి, బాలికను స్థానిక సఖీ సెంటర్‌లో తాత్కాలిక సంరక్షణ నిమిత్తం వసతి కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సైదులు, సఖి సెంటర్ సిబ్బంది మంజుల, హరిబాబు, పోలీసులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ లింక్ కెనాల్‌లో పడి బాలుడు మృతి


విజయ్ (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ లింక్ కెనాల్‌లో పడి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దఅడిశర్లపల్లి మండలం పడమటితండాకు చెందిన రమావత్ కిషన్ –పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఇంటి వద్దే ఉంటున్నారు. వీరి కుమారుడు విజయ్(6)తన సోదరి(పెద్దమ్మ కుమార్తె) అనూషతో కలిసి బట్టలు ఉతకడానికి ఉదయం తండా సమీపంలోని ఏఎమ్మార్పీ లింక్ కెనాల్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో సోదరి బట్టలు ఉతుకుతుండగా విజయ్ కాలువ ఒడ్డుపై ఉండి నీళ్లలోకి రాళ్లు వేస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో విజయ్ ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. గమనించిన అనూష కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి చూసే సరికి విజయ్ కాలువలో కొట్టుకుపోయాడు. దీంతో ఏఎమ్మార్పీ అధికారులతో మాట్లాడి కాలువ నీటిని నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టగా కొంత దూరంలోని బ్రిడ్జి సమీపంలో విజయ్ మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. విజయ్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని..

- ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఒకరి బలవన్మరణానికి కారకుడయ్యాడనే అభియోగం మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం బుడ్డారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన సైదులు(40) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా భార్యతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో సైదులు 20రోజుల క్రితం మిర్యాలగూడకు వచ్చి హనుమాన్‌పేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ గొడవ విషయంపై తన భార్య పెదనాన్న కుమారుడు వచ్చి మాట్లాడంతో అతడిని సైదులు బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన సదరు వ్యక్తి ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సైదులుపై కేసు నమోదు అయింది. దీంతో అతడు భయంతో కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఉరేసుకునికుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నీలగిరిలో విస్తరించనున్న ఐటీ పరిశ్రమ

- ముందుకొచ్చిన సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో త్వరలోనే ప్రారంభం కానున్న ఐటీ టవర్‌లో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ ముందుకొచ్చింది. ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ పరిశ్రమలు విస్తరించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా నీలగిరిలో నిర్మించిన ఐటీ టవర్‌లో సుమారు 200 ఉద్యోగాలను సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ కల్పించనుంది. సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు శ్రీని వీరవెల్లి అమెరికాలోని బోస్టన్ నగరంలో ఐటీ మంత్రి కేటీఆర్‌తో సమావేశం అనంతరం ప్రకటించారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్, ఆరోగ్య రంగం, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో సేవలందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ల కోసం సొనాటా కార్యకలాపాలు నిర్వహించనుంది. మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, పెట్టుబడుల కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, చీఫ్ రిలేషన్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

బావిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

నార్కట్‌పల్లి : వ్యవసాయ బావిలో గల్లంతైన వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మెండి యాదయ్య (55) నార్కట్‌పల్లి మండలం చిన్న తుమ్మలగూడెం గ్రామంలో జరుగుతున్న మల్లన్న పండుగకు కూతురు ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలో గల బావిలో ఈతకొట్టడానికి వెళ్లాడు. బావిలోకి దూకిన యాదయ్య అందులోనే గల్లంతయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి గజ ఈతగాళ్ల సహాయంతో యాదయ్య మృతదేహాన్ని బావిలోంచి బయటికి తీశారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పతిరలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

- నిందితుల్లో ఒకరు బాలుడు
- రూ. 3.18 లక్షల విలువగల విద్యుత్ వైర్లు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర


అరెస్ట్ చేసిన నిందితులతో పోలీసులు

భువనగిరి : విద్యుత్ వైర్ల చోరీ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరుతండాకు చెందిన బానోద్ చంద్రశేఖర్, బానోతు మధుకుమార్, మొద్దు కిషన్, మరో బాల నేరస్తుడితో పాటు భద్రాది కొత్తగూడెం జిల్లా రోళ్ల గడ్డతండాకు చెందిన గుగులోతు పవన్ కళ్యాణ్ వీరంతా కూలి పనులు చేసుకుంటూనే విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్నారు. వీరికి హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉండే పాత సామగ్రి విక్రయించే పిడిగు నవీన్ చోరీ చేయడానికి ఉపయోగపడే కట్టర్లు, ఇతర సామగ్రి, రవాణా వాహనం సమకూర్చుతున్నాడు. నిందితులు అక్కడక్కడ చోరీ చేసిన వైర్లను నవీన్‌కు విక్రయించేవారు. ఈ ముఠా సభ్యులు ఇటీవల బీబీనగర్‌లోని ఎంఆర్‌ఆర్ వెంచర్‌లో విద్యుత్ వైర్లను చోరీ చేశారు. ఈ నెల 20వ తేదీన వెంచర్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా నిందితులను కొండమడుగు వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ. 3.18 లక్షల విలువగల విద్యుత్ వైర్ల బండిళ్లు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఓ మైనర్ ఉండగా జెజె యాక్టు మేరకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. దొంగతనానికి పాల్పడేందుకు సహకారం అందించడంతో పాటు వైర్లను కొనుగోలు చేస్తున్న నవీన్ త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పట్టుబడిన వారు ఇప్పటికే బీబీనగర్, భువనగిరితో పాటు ఆత్మకూర్(ఎం) మండలాల పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. ఈ సమావేశంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్ అధికారుల పేరుతో..

కమర్షియల్ ట్యాక్స్ అధికారుల పేరుతో వాహనాలను నిలిపి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ నెల 22న రాత్రి తూర్పు గోదావరి జిల్లా చౌగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన ముళ్లపూడి వెంకటేశ్వరావు. కుమారుడు రామచంద్రరావుతో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన నక్కా లింగస్వామి, సైదాబాద్ గ్రామానికి చెందిన శ్యామల శ్యామ్ ప్రసాద్‌లు వారి వాహనాన్ని రెడ్డిబావి సమీపంలో నిలిపి ఒకరు కమర్షియల్ ట్యాక్స్ అధికారినని, మరొకరు రిపోర్టర్ అని చెప్పారు. వారిని బెదిరించడంతో పాటు కొట్టి వారి వద్ద ఉన్న ఫోన్ పే పిన్ తీసుకుని మరో ఫోన్ పే సెల్ నంబర్‌కు రూ.10 వేలు బదిలీ చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం డబ్బులను పంచుకున్నారు. వెంకటేశ్వరావు ఈ నెల 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. కాగా అదే రోజు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 10 వేల నగదు, బైకు, రెండు సెల్‌ఫోన్లు, గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో చౌటుప్పల్ డివిజన్ పోలీస్ కమిషనర్

విరిగిన విద్యుత్ స్తంభాలు


హుజూర్‌నగర్‌లో రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

హుజూర్‌నగర్ : తొలగిస్తున్న చెట్ల కొమ్మలు విద్యుత్ స్తంభాలపై పడడంతో నాలుగు విరిగిపోగా మరో మూడు ఒరిగిపోయాయి. ఈ ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక సుందరయ్య నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడటంతో 4 స్తంభాలు విరిగి కూలి పోయాయి. మరో 3 స్తంభాలు పాక్షికంగా కూలాయి. ఈ సమయంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న కొంతమంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సాయంత్రానికి విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

వృద్ధుడిపై కేసు

ఆత్మకూరు(ఎం): బాలికపై లైంగికదాడికి యత్నించిన వృద్ధుడిపై ఆత్మకూర్(ఎం) పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన వృద్ధుడు మామిడి పండ్లు ఇచ్చి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడే బాలికపై లైంగికదాడికి యత్నిస్తుండగా స్థానికులు గమనించడంతో పారిపోయాడు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నిందితుడిపై పోక్సో చట్టం కింద నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మోతె : విద్యుదాఘాదతంతో ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన కందూరి అమృతారెడ్డి తన ఎద్దును వ్యవసాయ బావి వద్ద తాడుతో కట్టివేశారు. తాడు పెద్దదిగా ఉండడంతో ఎద్దు గడ్డి మేస్తూ వెళ్లి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఎద్ద విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ముత్తిరెడ్డికుంట కాలనీకి చెందిన మాదాసు జయరాజ్(45) పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పట్టణంలోని శాంతినగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు బైపాస్ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అద్దంకి నుంచి నార్కట్‌పల్లి వైపునకు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో జయరాజ్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడికి భార్య విజయ సుశీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఒకరికి గాయాలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శోభనాద్రిగూడెం పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ్మారం విద్యుత్ ఆర్టిజన్ భూక్యా శ్రీను శోభనాద్రిగూడెం గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలకు జంపర్లు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. దీంతో శరీరం చాలా చోట్ల కాలిపోయింది. వెంటనే అతనిని కోదాడలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఈ విషయమై ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డిని సంప్రదించగా జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నామని చెప్పారు.

మిల్లర్‌పై చర్య తీసుకోవాలి

భువనగిరి: మిల్లులో క్వింటా ధాన్యానికి ఐదు కిలోలు అదనంగా తీసుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలోని అనాజిపురం గ్రామం వద్ద నల్లగొండ రోడ్డుపై రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లు యజమాని రైతులను పిలిచి ఐదు కిలోల తరుగు తీసి తూకం వేయడం సరికాదన్నారు. రైతులను నిలువునా దోచుకుంటున్న మిల్లు యాజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మైలారం వెంటకేశం, వార్డు సభ్యులు గోగు శ్రీను, పిట్టల వెంకటేష్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు అశోక్, గ్రామ కోఆప్షన్ సభ్యులు నీలం ముత్తయ్య, సత్తి, ఉప్పలయ్య, పాల్గొన్నారు.


అనాజిపురంలో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

బేసిక్ కంప్యూటర్ అండ్ ఇంగ్లిష్, బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాల వ్యవధి గల బేసిక్ కంప్యూటర్స్ అండ్ ఇంగ్లిష్, 45 రోజుల కాలవ్యవధి గల బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్ అండ్ ఇంగ్లిష్ కోర్సుకు ఇంటర్మీడియట్, బ్యుటీషియన్ కోర్సుకు పదోతరగతి పాసై ఉండాలని తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్ కోర్సుకు రూ.1000లు, బ్యుటీషియన్ కోర్సుకు రూ.1500లు ఫీజు చెల్లించాలన్నారు. అలాగే నెలకు రూ. 3వేల ఫీజుతో హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు. 18నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు కల్గి, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటోలతో జూన్ 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావలెయునని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల కమిషన్ స్టడీ టీం సభ్యులు

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో 2018సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎక్కువ, తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెస్(ఎన్నికల కమిషన్ స్టడీ టీం) బృందం సభ్యులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ నమోదైన డిండి మండలం బొగ్గులదొన, తక్కువ పోలింగ్ నమోదైన దేవరకొండ పట్టణంలోని పోలింగ్ బూత్ నెం:87ను టీం లీడర్ ఈదయ్య ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల డీటీ ముబీన్ నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్ల జాబితాను తీసుకొని సర్వే చేశారు.సర్వేలో భాగంగా పలువురు ఓటర్లను గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారా..లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించనున్నట్లు ఈదయ్య తెలిపారు.వారి వెంట స్టడీ టీం సభ్యులున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రాయగిరి సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన ఇలా ఉన్నాయి. రాయగిరి నుంచి ఆలేరు వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం మార్గమధ్యలో స్కూటీని, అదే విధంగా మరో బైకును ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనదారులు కింద పడిపోయారు. స్కూటీపై ఉన్న జావిద్, యాసిన్, బైకుపై ఉన్న కేతన్, గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం : తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్పీ రాజేంద్రప్రసాద్ కేసు వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లికి చెందిన రఘు, తిరుపతికి చెందిన గణేష్‌కు 2022లో చర్లపల్లి జైలులో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక వీరిద్దరూ చోరీలు చేయడం ప్రారంభించారు. కాగా, ఒక్కొక్కరిపై ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30కి పైగా కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద ఉదయం 5 గంటల సమయంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌లపై వెళ్తున్న వీరు అనుమానాస్పదంగా కనిపించారు. వీరు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. ఎక్కిడివని ఆరా తీయగా మేడిపల్లి, సూర్యాపేట, తొర్రూరు, కోదాడలో చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితుల వద్ద 16తులాల బంగారం, 880 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. దొంగలను చాక చక్యంగా పట్టుకున్న సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు పడిశాల శ్రీనివాస్, యాకూబ్, సతీష్ వర్మ సిబ్బందిని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అభినందించి రివార్డులు అందజేశారు.

బైకు దొంగ అరెస్ట్

భువనగిరి : బైకు దొంగను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన పరుశురాములుకు చెందిన టీవీఎస్ ఎక్సల్ ఈ నెల 13వ తేదీన చోరీకి గురైంది. అదే రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణ శివారులోని డాల్ఫిన్ హోటల్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా టీవీఎస్ ఎక్సల్ పై వెళ్తున్న పట్టణంలోని హన్మన్‌వాడకు చెందిన పట్టి శ్రీహరి అనుమానంతో పట్టుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వాహనం స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.